




● జిల్లాలోని ఓ రైస్ మిల్లులో నిల్వ ఉంచిన ధాన్యం నిల్వలు

దొడ్డు బియ్యం.. వద్దు!

- జిల్లాలో నిలిచిన 10 వేల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం ధాన్యం మిల్లింగ్
- రైస్ మిల్లులలో భారీగా పేరుకుపోయిన నిల్వలు
- సన్నబియ్యం ఎఫెక్ట్‌తో మిల్లర్లపై అదనపు భారం
- ప్రభుత్వ ఆదేశాలతోనే తిరిగి మిల్లింగ్‌కు అవకాశం
- జిల్లాలో మొత్తం ఎనిమిది రైస్ మిల్లుల్లో ఇదే తీరు



ఆదిలాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన సన్న బియ్యం పంపిణీతో దొడ్డుబియ్యం మిల్లింగ్‌కు చెక్ పడింది. దొడ్డు బియ్యం వద్దంటూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలపై గందరగోళ పరిస్థితి ఏర్పడుతుంది. జిల్లా అధికారులు ఏప్రిల్ 1వ తేదీ నుంచి రైస్‌మిల్లుల్లో దొడ్డు ధాన్యం మిల్లింగ్‌ను పూర్తిగా నిలిపి వేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో అంతంత మాత్రంగానే వరి పంట సాగవుతోంది. దీంతో నిర్మల్, కోరుట్లా, నిజామాబాద్ జిల్లాల నుంచి జిల్లాలోని రైస్‌మిల్లులకు వరి ధాన్యాన్ని తరలించి మిల్లింగ్ చేస్తారు. 2023 యాసంగి సీజన్‌కు సంబంధించిన దొడ్డు ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు అందించారు. అయితే గడువు సమయం మించిపోయినా.. రైస్ మిల్లర్లు మాత్రం తిరిగి ప్రభుత్వానికి సీఎంఆర్ రైస్‌ను సరఫరా చేయలేదు. జిల్లాలో చిన్నవి పెద్దవి కలిపి మొత్తం 8 రైస్ మిల్లులు ఉన్నాయి. వీటి పరిధిలో దాదాపుగా 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు పేరుకు పోయిన్నట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. అంతేకాకుండా జిల్లాలో గత 23 రోజులుగా ధాన్యం మిల్లింగ్ ప్రాసెస్ నిలిచిపోవడంతో రైస్ మిల్లర్లు ఆందోళనకు గురవుతున్నారు. అయితే ప్రభుత్వ తదుపరి ఆదేశాలతోనే ధాన్యం మిల్లింగ్‌ను తిరిగి ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.

ఆలస్యం చేస్తే అసలుకే మోసం

గత రెండేళ్ల క్రితం రైస్ మిల్లర్లకు అందించిన ధాన్యాన్ని ఇప్పటి వరకు ప్రభుత్వం తిరిగి తీసుకోలేదు. మరింత జాప్యం చేస్తే అసలుకే మోసం జరిగే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే గడువు సమయం ముగిసిపోయినా.. పలుమార్లు సంబంధిత రైస్‌మిల్లర్ యజమానులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. అయిన ఆశించిన ప్రయోజనం కనిపించడం లేదు. ఇటీవల ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీని ప్రారంభించడంతో దొడ్డుబియ్యం జోలికి వెళ్లడం లేదు. మరింత ఆలస్యం చేస్తే దొడ్డుబియ్యం నిల్వలు పక్కదారి పట్టే ప్రమాదం ఉందంటున్నారు. ఇప్పటికే 2025 యాసంగి సీజన్‌కు సంబంధించిన పంట దిగుబడులు చేతికి వచ్చాయి. దీంతో ధాన్యం నిల్వలను ఖాళీ చేసేందుకు రైస్ మిల్లర్లు ప్రయత్నం చేస్తున్నారు. కొత్తగా వచ్చే ధాన్యం నిల్వలకు అవకాశం ఉండదని చెబుతున్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న రైస్‌మిల్లుల్లో నిత్యం 300ల క్వింటాళ్ల వరకు ధాన్యాన్ని మిల్లింగ్ చేసే అవకాశం ఉంది. గత 23 రోజులుగా మిల్లింగ్ నిలిచి పోవడంతో ధాన్యం నిల్వలు భారీగా పేరుకు పోతున్నాయని రైస్‌మిల్లర్లు చెబుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాలు వస్తేనే ప్రారంభిస్తాం

: వాజీద్‌ఆలీ, డీఎస్‌వో, ఆదిలాబాద్

ప్రభుత్వ ఆదేశాలతోనే దొడ్డు ధాన్యం మిల్లింగ్‌ను నిలిపి వేయడం జరిగింది. మళ్లీ ప్రభుత్వ ఆదేశాలు వస్తేనే తిరిగి ప్రారంభిస్తాం. ఇప్పటికే రైస్ మిల్లుల్లో తగిన నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీపై దృష్టి సారించింది. దొడ్డు బియ్యాన్ని తిరిగి ఇచ్చేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేదు. ఇప్పటికే గడువులోగా సీఎంఆర్ రైస్‌ను తిరిగి ఇవ్వని రైస్‌మిల్లర్లకు నోటీసులు ఇచ్చాం.

రైస్ మిల్లర్లపై ఎఫెక్ట్



రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో రైస్‌మిల్లర్లపై భారం పడుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. సన్నబియ్యం పంపిణీ సంగతి ఏమో కానీ రైస్‌మిల్లర్ల పరిస్థితి గందరగోళంగా మారింది. గత 23 రోజులుగా పూర్తిగా మిల్లింగ్ నిలిచి పోవడంతో కూలీలు, సిబ్బంది వేతనాలు కూడా చేతికి రావడం లేదంటున్నారు. కనీసం కరెంట్ చార్జీలకైనా ఆదాయం రావడం లేదని చెబుతున్నారు. మిల్లింగ్ నిలిచిపోతే రోజుల తరబడి లేబర్ అందుబాటులో ఉండరని పేర్కొంటున్నారు. మరో నెల రోజుల్లో వర్షాకాల సీజన్ ప్రారంభమైతే అనుకున్నంత స్థాయిలో

తరువాయి 6వ పేజీలో...



పరిశీలిస్తున్న అడిషనల్ డీఆర్‌డీవో

పడిపోతున్న భూగర్భజలాల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యక్రమం

ఉట్నూర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పడిపోతున్న భూగర్భ జలాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్చర్ కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా గ్రామీణాభివృద్ధి అదనపు అధికారి కుటుంబరావు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద ఇంకిపోతున్న బోరుబావి వద్ద నిర్మిస్తున్న బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్చర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఐదేసి బోరుబావుల వద్ద ఇంకిపోతున్న బోరుబావులలో భూగర్భజలాలు అభివృద్ధి చేయడానికి ఈ కార్యక్రమం ద్వారా పడుతుందన్నారు. ఒక్కొక్క రీచార్జ్ స్ట్రక్చర్ నిర్మాణానికి రూ.38 వేలు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఈజీఎస్ ఏపీవో రజనికాంత్, తదితరులున్నారు.

రాజీవ్ యువశక్తి దరఖాస్తుల పరిశీలన

బోథ్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువశక్తి పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసుకున్నవారు పూర్తిస్థాయి సమాచారాన్ని దరఖాస్తులో క్రోడికరించారా? లేదా? అనే విషయాన్ని పరిశీలించారు. అంతేగాక కొందరు పథకం కోసం కొంతమంది ఇతర మండలాల వారు దరఖాస్తు చేసుకోవడంతో అటువంటి వారి దరఖాస్తులను పరిశీలించి వారికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడం జరిగింది. దరఖాస్తుల పరిశీలన అనంతరం రానున్న రోజుల్లో కమిటీ ఆధ్వర్యంలో అర్హులను గుర్తించనున్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

నార్నూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రైతన్నలు పండించే జొన్నలు దళారులకు విక్రయించి మోసపోకుండా ప్రాథమిక సహకార సొసైటీ కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి విక్రయించాలని ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. బుధవారం ప్యాక్స్ ఇన్‌చార్జి చైర్మన్ సురేష్ ఆడె అధ్యక్షతన జొన్నలు కొనుగోలు కేంద్రానికి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం మద్ధతు ధర క్వింటాలుకు రూ.3371 ప్రకటించింది ఎలాంటి ఇబ్బందికు గురికాకుండా నేరుగా కేంద్రానికి తెచ్చి విక్రయించాలన్నారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కృషితో దేశంలోనే టాప్ 5 నార్నూర్ మండలానికి అవార్డ్ రావడం చాలా గర్వకారణమని కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతున్నామన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాయంలో కల్యాణ్‌లక్ష్మి, షాదీముబారక్ 33 చెక్కులను పంపిణీ చేశారు. ఇందులో మార్కెట్ వైస్ చైర్మన్ సాయం మారుతి, మాజీ జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్, వక్ఫ్ బోర్డ్ మాజీ చైర్మన్ యునుస్, మెస్రం హన్మంతు, దేవురావు లోకండే, రాష్ట్రపాల్ గులే, షేక్ దస్తగిర్, షేక్ మహమ్మద్, తదితరులున్నారు.



నార్నూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

జిల్లాలో దంచికొడుతున్న ఎండలు

● రారెత్తిస్తున్న ఎండలతో పెరిగిపోతున్న పగటి ఉష్ణోగ్రతలు ● అత్యధికంగా మావలలో 44.4 డిగ్రీల నమోదు

ఆదిలాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): భానుడి భగభగలకు ఎండలు దంచికొడుతున్నాయి. ఆదిలాబాద్‌లో రారెత్తిస్తున్న ఎండలతో పగటి ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరిగిపోతున్నాయి. బుధవారం ఆదిలాబాద్ జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 44.3 డిగ్రీలు కాగా కనిష్ఠంగా 30.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.గరిష్ఠ ఉష్ణోగ్రతల మాదిరిగానే కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగి పోతున్నాయి.దీంతో రాత్రి పగలు అనే తేడా లేకుండా తీవ్రమైన ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అలాగే అత్యధికంగా మావల మండలంలో 44.4 తలమడుగులో 44.2, భీంపూర్‌లో 44.0, ఆదిలాబాద్‌అర్బన్ 44.1, భీంపూర్‌లో 44.0, గుడిహత్నూర్‌లో 43.7 ఆదిలాబాద్‌రూరల్ మండలంలో 43.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా దాదాపుగా జిల్లా వ్యాప్తంగా 41 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు కనిపిస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరుకుంటే రెడ్ అలర్ట్‌ప్రకటించే ప్రమాదం కనిపిస్తుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు తీవ్రమన ఎండలతో ప్రజలు బెంబెలెత్తి పోతున్నారు.ఏదైనా అత్యవసర పని ఉంటే తప్ప ఎవరు మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లడం లేదు. దీంతో ప్రధాన రహదారులన్నీ నిర్మానుషంగా మారి కనిపిస్తున్నాయి.ఎండల తీవ్రతకు వ్యాపారాలు దెబ్బతింటున్నాయని చిరువ్యాపారులు వాపోతున్నారు.వడగాలుల ప్రభావంతో మరికొన్నాళ్ల పాటు ఉష్ణోగ్రతలు తీవ్రత ఎక్కువగానే ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.



● ద్విచక్ర వాహనంపై నీటిని చల్లుతున్న వాహనదారుడు



ఆదిలాబాద్‌లో నిర్మానుష్యంగా మారి కనిపిస్తున్న ప్రధాన రహదారి



ముఖానికి స్కార్ఫ్, రుమాలు ధరించి వెళ్తున్న వాహనదారులు

అందుబాటులో పోలీసు సబ్ కంట్రోల్ రూమ్

● జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ● ప్రజలకు తక్షణ సహాయంగా బస్టాండ్ వద్ద పోలీసు సబ్ కంట్రోల్ ప్రారంభం



కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్



మజ్జిగ పంపిణీ చేస్తూ..

ఆదిలాబాద్ అర్బన్/ ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో, పరిసర ప్రాంతాలలో ఎలాంటి దొంగతనాలు, పిక్‌పాకెట్స్, ఈవ్‌టీజింగ్, రోడ్డు ప్రమాదాలు జరుగకుండా తక్షణ సహాయంగా జిల్లా పోలీసు యంత్రాంగం అందుబాటులో ఉంటుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. దీనిలో భాగంగా బుధవారం పట్టణంలోని బస్టాండ్ వద్ద పోలీసు సబ్ కంట్రోల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ఎలాంటి సమస్యలకైనా క్షణాల వ్యవధిలో స్పందించే విధంగా ఉదయం నుంచి రాత్రి వరకు ఒక ఏఎస్సై, హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్ అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలందిస్తారని తెలిపారు. అంతేకాకుండా బస్టాండ్ వద్ద, లోపల ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలను చోటు లేకుండా పర్యవేక్షించే విధంగా పోలీసు సబ్ కంట్రోల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, పట్టణ సీఐలు సీహెచ్.కర్ణాకర్‌రావు, బి.సునిల్ కుమార్, ప్రణయ్‌కుమార్, ఏఎస్సై ముకుందరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయం

ఆదిలాబాద్ అర్బన్: ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో వయోవృద్ధులు సామాజిక బాధ్యతగా మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వయోవృద్ధుల సమాఖ్య ఆధ్వర్యంలో వన్‌టౌన్ ఎదుట ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీని ఆర్టీఓ వినోద్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీని సమాఖ్య ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వేసవిలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న సంద ర్భంలో వయోవృద్ధులు ముందుకు వచ్చి ప్రజలకు ఉపశమనం కలిగించేలా మజ్జిగ పంపిణీ చేయడం హర్షనీయమన్నారు. ఇందులో డీఎస్పీ జీవన్‌రెడ్డి, వన్ టౌన్ సీఐ, వయోవృద్ధుల సమాఖ్య అధ్యక్షుడు దేవిదాస్ దేశ్‌పాండే, సత్యనారాయణ, వామన్, నీలా కిషన్, భాస్కర్, పి.శంకర్, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సమితి సభ్యులు

కలెక్టర్‌ను సన్మానించిన సనాతన హిందూ ఉత్సవ సమితి

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ప్రజాస్వామ్య పరిపాలన ఉత్తమ పురస్కారానికి ఎంపికై ప్రధాని మోదీ చేతుల మీదుగా అవార్డును స్వీకరించిన ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషాకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు కలెక్టర్ ను కలిసి సత్కరించారు. ప్రధాని చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న చిత్రాన్ని జ్ఞాపికగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్ష, కార్యదర్శులు ప్రమోద్ కుమార్, మాధవ్, సూర్యకాంత్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



సాయిచైతన్య జాదవ్ తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సాయిచైతన్య తల్లిదండ్రులకు సన్మానం

ఉట్నూర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు కవిత కుమారుడు సాయిచైతన్యజాదవ్ ఐఏఎస్‌కు ఎంపిక కావడం పట్ల సాటి ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేయడంతో పాటు సాయిచైతన్య తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. బుధవారం మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సాటి ఉపాధ్యాయురాలు కవిత, ఆమె భర్త హెడ్ కానిస్టేబుల్ గోవింద్ జాదవ్‌లను సన్మానించారు.ఈ దంపతుల కుమారుడు సాయిచైతన్య యూనియన్ పబ్లిక్ సర్వీస్ విడుదల చేసిన సివిల్స్ ఫలితాలలో ఆల్ ఇండియా ర్యాంకు 68పొంది ఐఏఎస్‌గా ఎంపికైనందున, అలాంటి గొప్ప తల్లిదండ్రులు జాదవ్ గోవింద్‌రావు హెడ్‌కానిస్టేబుల్, కవిత టీచర్‌లను పాఠశాల తరపున సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కోవ జ్యోతి, పాఠశాల సిబ్బంది, పోషకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు జొన్నల కొనుగోళ్లు నిలిపివేత

తాంసి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొనుగోలు చేస్తున్న జొన్నల కొనుగోలు కేంద్రంలో బుధవారం కొనుగోలు నిలిపివేసినట్లు సీఈవో కేశవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రానికి అధిక మొత్తంలో జొన్నలు రావడంతో స్థల భావం వల్ల వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. 25వ తేదీ నుంచి యథావిధిగా కొనుగోలు చేస్తామని, విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

గ్రామాలలో మంచినీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

బోథ్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత దృశ్య గ్రామాలలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో రమేష్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామాల కార్యదర్శులతో మాట్లాడారు. అంతేగాక మే ఒకటి నుంచి రాజీవ్ యువశక్తి పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి జాబితాను పరిశీలించడం జరుగుతుందని, అయితే పూర్తిస్థాయి నివేదికతో కార్యదర్శులు సిద్ధంగా ఉండాలని సూచించారు. మంచి నీటి ఎద్దడిపైన జిల్లా ఉన్నతాధికారులు చేసిన సూచనల ప్రకారం నీటి ఎద్దడి నివారణపై దృష్టి సారించాలన్నారు. కాగా తీవ్రమైన మంచినీటి ఎద్దడి ఉన్న గ్రామాల జాబితాను జిల్లా ఉన్నతాధికారులకు పంపించడం జరిగిందని, అనుమతులు రాగానే నీటి నివారణ చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

జైనథ్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని ఆయా గ్రామాలలో గల ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ రవీంద్రనాథ్, మండల ప్రత్యేక అధికారి భాస్కర్ నాయక్‌లు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన జైనథ్ రైతు వేదిక భవనంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కేంద్రం బహిరంగ విచారణ వేదిక కార్యక్రమానకి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఈ వేదికలో 75 దరఖాస్తులు రూ.రెండు లక్షల రుణమాఫీ, భూమి సమస్యలు ఉచిత విద్యుత్ గ్యాస్‌పై వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. ఇందులో సాత్నాల ఎంపీడీఓ వెంకట్‌రాజ్, బోరజ్ ఎంపీడీఓ వేణుగోపాల్, తహసీల్దార్లు ఆత్రం నారాయణ, రాథోడ్ రాజేశ్వరి, విశ్వనాథ్, ఏఓలు పూజ, అస్రఫ్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభం

ఉట్నూర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు గురువారం నుంచి వేసవి సెలవులు ప్రారంభమవుతున్నాయి. బుధవారం పాఠశాల చివరి రోజులో భాగంగా పలు పాఠశాలల్లో పోషకులు, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో చివరి రోజైన బుధవారం విద్యార్థులకు ప్రగతి పత్రాలను అందించారు. ఆ తర్వాత పోషకులకు వేసవి సెలవులలో విద్యార్థుల పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. చదువులపై ఎలాంటి శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జ్యోతి, పాఠశాల సిబ్బంది, పోషకులు, విద్యార్థులు, సీఆర్‌పీ ధరమ్‌సింగ్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

తలమడుగు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు మెరుగైన విద్య లభిస్తుందని మండల విద్యాధికారి జి వెంకట్రావు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాల యజమాన్యాలు చెప్పే మాయ మాటలకు విద్యార్థుల తల్లిదండ్రులు మోసపోవద్దన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు నాణ్యమైన విద్యతో పాటు, ఉచిత భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉచిత దుస్తులు విశాలమైన క్రీడా ప్రాంగణం కంప్యూటర్ విద్య తదితర ప్రభుత్వం సదుపాయాలు కల్పిస్తుందన్నారు. ఈ సంవత్సరం మండలంలోని 52 పాఠశాల గాను దాదాపు 3 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించారన్నారు. జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ సర్టిఫికెట్లను అందజేశారు. ఇందులో ఎస్‌ఎంసి కమిటీ ఉపాధ్యాయులు రాకేష్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.



తలమడుగులో విద్యార్థికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఎంఈవో



క్యాండిళ్లు వెలిగించి అమరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

పహాల్గావ్ దాడి పట్ల హిందూ సంఘాల నిరసన

ఆదిలాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్ పహాల్గావ్ దాడిని నిరసిస్తూ హిందూ సంఘాలు నిరసనకు దిగాయి. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని వినాయక్ చౌక్‌లో హిందూ సంఘాలు నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా నాయకులు పాకిస్తాన్ జెండాను కాళ్లతో తొక్కి వినూత్నంగా నిరసన తెలిపారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం క్యాండిల్స్ వెలిగించి అమరులైన వారికి నివాళులు అర్పించారు.

ఉట్నూర్: కాశ్మీర్ పహాల్గావ్‌లో జరిగిన ఉగ్రదాడికి మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని పట్టణ ప్రజల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదాన్ని అంతం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రదాడిలో మరణించిన 27 మంది భారతీయుల ఆత్మశాంతి కలగాలంటే ఉగ్రవాదులకు మద్దతు ఇస్తున్న దేశానికి గుణపాఠం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇందులో బానోత్ జగన్, కొండేరి రమేష్, కపిల్ కుమార్, రాథోడ్ శేషరావు, పవర్ గంగారాంనాయక్, కొమ్ము రామచందర్, బింగి వెంకటేశ్, దుర్వా మహేశ్, బొడ్డు కిరణ్, కైలాస్, తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలను రెచ్చగొడితే కేసులు : డీఎస్పీ

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మత విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులను తయారుచేసినా, వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేసినా.. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. జిల్లావ్యాప్తంగా సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, ఎక్స్ లాంటి సోషల్ మీడియాల్లో పోస్టులపై పోలీస్ సిబ్బంది పర్యవేక్షిస్తుంటారని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

నేరడిగొండ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. బుధవారం మండలంలోని నారాయణ్ పూర్ గ్రామంలో పశువులకు సామూహిక ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమం మే నెల 17వ తేదీ వరకు గ్రామాల వారీగా గాలికుంటు నిరోధక టీకాల కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'రుణమాఫీ చేయకుంటే ఆందోళనలు చేస్తాం'

తాంసి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రేవంత్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తిస్థాయి రైతులకు రుణమాఫీ చేస్తామని ప్రకటించినప్పటికీ ఇంకా చేయకపోవడం సమంజసం కాదని బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డుకు లింకు లేకుండా పూర్తిస్థాయి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా రుణమాఫీ కానీ రైతులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రైతు ప్రభుత్వంగా అధికారం చేపట్టిన రేవంత్ సర్కార్ పూర్తిస్థాయి రైతులకు ఎందుకు రుణమాఫీ చేయడం లేదని ప్రశ్నించారు. వెంటనే రుణమాఫీ చేయాలని కోరారు. రాష్ట్రంలో నిరంకుశ పాలన జరుగుతుందని ఆరోపించారు. రేవంత్ సర్కార్ ప్రజల్లో నమ్మకం కోల్పోయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సుధాకర్ యాదవ్, నాయకులు నాగిడి నర్సారెడ్డి, కాల్ల అనిల్ రెడ్డి, అర్షుల అశోక్, బారే కిషన్, తదితరులు ఉన్నారు.

దేశానికి దిక్సూచి భూభారతి చట్టం

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టం దేశానికి దిక్సూచి లాంటిదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్ యార్డులో భూ భారతి ఆర్వోఆర్ చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి చట్టం రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. ఏ తప్పు చేయకుండానే రైతులను, అధికారులను ధరణి దోషులుగా నిలబెట్టిందన్నారు. రైతుల కోసం ఎంతో మంది మేధావులు నాయకులు, రైతు సంఘాల నాయకులు అధికారులతో చర్చించి మెరుగైన ఆర్వోఆర్ చట్టాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడారు. అనంతరం స్థానిక మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో జీవన్ రెడ్డి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ డోంగ్రే మారుతి పటేల్, తదితరులు పాల్గొన్నారు.

● 'అటవీ శాఖ సమస్యలపై స్పందించకుంటే ఆందోళన'

ఉట్నూర్: జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో అటవీ శాఖ అధికారులు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోక పోతే ప్రజలతో కలిసి ఆందోళన చేయాల్సి వస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న పీఎంఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన భూభారతి కొత్త చట్టం అవగాహన సదస్సు జిల్లా కలెక్టర్ రాజార్షిషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పోడు భూములు సాగు చేస్తున్న ఇంద్రవెల్లి మండలంలోని కన్నాపూర్ ప్రాంతంలో అటవీ శాఖ అధికారులు పోడు భూముల్లో మొక్కలను పెంచడానికి ప్రయత్నిస్తున్నారని గిరిజనుల ద్వారా తెలిసిందని, అదే విధంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక తీసుకు రానీయడం లేదని, బీర్సాయిపేట ప్రాంతంలో తునికి ఆకు తెస్తున్నారని ఆటోను పట్టుకోవడం జరిగిందన్నారు.



ఇంద్రవెల్లిలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కలెక్టర్ రాజర్షిషా

పాఠశాలలో మాతృ పాద పూజోత్సవం

తలమడుగు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కప్పర్‌దేవి గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం పాఠశాల చివరి రోజున మాతృ పాద పూజోత్సవం కార్యక్రమాన్ని పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ప్రఫుల్ చంద్ రెడ్డి, ఉపాధ్యాయులు సాయి కాంత్. ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల చేత తల్లిదండ్రులకు పాదాభివందనం నిర్వహించారు. ఆ తర్వాత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో ప్రోగ్రెస్ రిపోర్టులను అందజేశారు.

తలమద్రి గ్రామానికి రావాలని ఆహ్వానం

నేరడిగొండ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండలంలోని తలమద్రి గ్రామస్థులు బుధవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి తమ గ్రామాన్ని సందర్శించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువతో సన్మానించి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సానుకూలంగా స్పందించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ భగత్ అడేళ్లు, పాముల రవి కుమార్, సుమన్, కొటేశ్వర్, వినోద్, గంగాధర్, శివ, తదితరులు పాల్గొన్నారు.

చాంద(టీ)లో రేణుకా మాత విగ్రహ ప్రతిష్ఠ

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వ నిధులు ఖర్చు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాత్రమే సాధ్యమైందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. సనాతనంగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను భావి తరాలకు తెలియచేస్తూ సన్మార్గంలో నడవాలని అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాంద(టీ) గ్రామంలో నిర్మించిన రేణుక మాత ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను బుధవారం ఘనంగా జరిపారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి జోగురామన్నకు నిర్వాహకులు సాదరంగా స్వాగతం పాలికారు. ఆలయ అభివృద్ధికి ఆయన రూ.5 లక్షల సహాయం అందించడం పట్ల గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ కార్యక్రమం

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం కాపాడుతు హజ్ యాత్రను యాత్రీకులు విజయవంతంగా పూర్తి చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. బుధవారం టీఎన్జీవోస్ హోంలో ఆదిలాబాద్ హజ్ సొసైటీ ఆధ్వర్యంలో హజ్ యాత్రికులకు మేడికల్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై యాత్రికులకు ఆరోగ్య సుత్రాలను వివరించారు. అనంతరం వ్యాక్సినేషన్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వైసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సివిల్స్ ఫలితాల్లో సత్తా చాటిన సందీప్

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): యూపీఎస్‌సీ సివిల్స్ ఫలితాల్లో ఆదిలాబాద్ జిల్లా యువకుడు ఆదా సందీప్ సత్తా చాటాడు. ఇంటెలిజెన్స్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్గా పని చేస్తున్న వెంకటేష్ వాణి దంపతుల చిన్న కుమారుడు సందీప్ సివిల్స్ ఫలితాల్లో 667 ర్యాంక్ సాధిచాడు. గతంలో తొలి ప్రయత్నంలో 830 ర్యాంక్ సాధిచాడు. అదే పట్టుదలతో మళ్లీ పరీక్ష రాసి ఇప్పుడు 667 ర్యాంక్ సాధించడంతో కుటుంబీకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పలువురు సందీపన్ను అభినందించారు.

'అణగారిన వర్గాల కోసం ఆసుపత్రులు లేవు'

బేల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): బీసీ, ఎస్సీ, ఎస్టీ లైనా అణగారిన పేద వర్గాలకు కనీసం ఆస్పత్రులు దిక్కులేవని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి అక్కడ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి నిర్వహణ అధ్వానంగా ఉండడంతో తానే స్వయంగా బూజు దులిపి చీపురులతో ఊడ్చి వేశారు. డాక్టర్‌తో మాట్లాడి రెండు రోజుల్లో ఆస్పత్రికి శుభ్రం పర్చాలని అన్నారు. అలాగే, మండలంలోని శంషాబాద్‌లో ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కోడె గోవిందు(35) కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని మృతుడి భార్యకు ఉద్యోగం పిల్లలను రెసిడెన్షియల్ స్కూల్‌లో చదివించి తండ్రిలేని లోటు తీర్చాలని డిమాండ్ చేశారు.

దొడ్డుబియ్యం వద్దు!

(5వ పేజీ తరువాయి...)

మిల్లింగ్ చేసేందుకు అవకాశం ఉండదంటున్నారు. అలాగే తరుగు ఎక్కువ కావడంతో నష్టపోయే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. దొడ్డు ధాన్యాన్ని మిల్లింగ్ చేయకుండా నిలిపి వేస్తే నూక శాతం పెరుగుతుందని రైస్‌మిల్లర్లు ఆందోళనకు గురవుతున్నారు. ఇవే పరిస్థితులు మరికొన్నాళ్ల పాటు కొనసాగితే మిల్లులను నడపడం కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో అధికారులు వెంట పడిన సకాలంలో సీఎంఆర్ రైస్‌ను తిరిగి ఇవ్వని రైస్‌మిల్లర్లు ఇప్పుడు దానికి భిన్నంగా దొడ్డు బియ్యాన్ని అందించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం మిల్లింగ్‌ను నిలిపి వేయాలని ఆదేశించడంతో అయోమయానికి గురవుతున్నారు.

టిప్పర్ ఢీకొని రిటైర్డ్ ఉపాధ్యాయుడి మృతి

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ కలెక్టరేట్ చౌరస్తాలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవోళ్ల నారాయణ (63) అనే రిటైర్డ్ టీచర్ అక్కడికక్కడే మృతి చెందారు. విద్యానగర్ కాలనీలో నివాసం ఉంటున్న నారాయణ మార్నింగ్ వాక్ అనంతరం స్కూటీపై ఇంటికి వెళుతుండగా కలెక్టర్ చౌరస్తాలో మూలమలుపు వద్ద టిప్పర్ వాహనం ఢీకొంది. దీంతో టిప్పర్ టైర్ల కిందికి పడి అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సిగ్నల్స్ లేకనే తరచూ ప్రమాదాలు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ చౌరస్తాలో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కొమురం భీమ్ చౌరస్తా సర్కిల్‌ను మరింత విశాలంగా పెంచడం, ప్రధాన కూడలిలోనే ట్రాఫిక్ సిగ్నల్స్ పెట్టకపోవడం వల్లే ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అసలే ఇరుకు రోడ్లు, ఆపై పద్మవ్యూహాన్ని తలపించే జిగ్ జాగ్ కూడలి నిత్య ప్రమాదాలకు కారణభూతమవుతోంది. ఇప్పటికే ఈ చౌరస్తాలో ఏడు ఎనిమిది మంది మృతి చెందారని, 40 మందికి పైగా ప్రమాదాలు చోటుచేసుకుని గాయపడ్డారని అక్కడి ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, కలెక్టర్ రాజార్షి షా స్పందించి కలెక్టరేట్ చౌరస్తాను ప్రమాద రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కప్పర్లలో అగ్నిప్రమాదం

తాంసి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కప్పర్ల గ్రామంలో బుధవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో పశువుల పాకతో పాటు రెండు మ్యాక్స్ పికప్‌లో ఖాళీ బూడిదయ్యాయి. ముగ్గురి వ్యక్తులకు సంబంధించిన రూ.25 లక్షల వరకు ఆస్తినష్టం జరిగింది. గ్రామ సమీపంలో పంట చేలకు అనుకోని ఉన్న బొమ్మిడి బుచ్చన్నకు చెందిన పశువుల పాక అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. పశువుల పాకతో పాటు స్ప్రింక్లర్లు, గడ్డి ఇతర వ్యవసాయ పనిముట్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఐదు లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని రైతు వాపోయారు. అదేవిధంగా గండ్రత్ అభిలాశ్, దారట్ల ప్రవీణ్‌లకు చెందిన మాక్స్ పికప్ వాహనాలు 50 శాతం మేర కాలిపోయాయి. వీటిలో సుమారు రూ. 15 లక్షల వరకు ఉంటుందని బాధిత రైతులు కన్నీరు మున్నీరయ్యారు. సమాచారం తెలుసుకున్న తాంసి ఎస్ఐ రాధిక ఘటన స్థలానికి చేరుకుని గ్రామస్థుల సహాయంతో మంటలను అదుపు చేశారు. గ్రామస్థులు, యువకులు మంటలార్పడంలో చొరవ చూపడం వల్ల పెను ప్రమాదం తప్పింది. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుంటామని ఎస్ఐ పేర్కొన్నారు. అదే విధంగా అగ్నిమాపక సిబ్బంది లీడింగ్ ఫైర్ మెన్ సుంగన్న సిబ్బంది సకాలంలో ఘటన స్థలానికి చేరుకున్నప్పటికి అప్పటికే మంటలు అదుపులోకి వచ్చాయి. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

'రేషన్ బియ్యం తూకం వేసి ఇవ్వాలి'

బోథ్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బోథ్‌లోని సివిల్ సప్లై గోడౌన్ నుండి డీలర్లకు వేస్తున్న బియ్యం తూకం వేయకుండా ఇవ్వడంతో తమ నష్టపోతున్నామని పలువురు డీలర్ సివిల్ సప్లై అధికారి దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా కలెక్టర్ పర్యటన సందర్భంగా ధన్నూరు గ్రామానికి వచ్చిన డిఎస్‌ఓకు ఈ విషయమై స్థానిక డీలర్లు వివరించారు. 50 కిలోల బస్తా ఉందంటూ తూకం వేయకుండానే రేషన్ షాపులకు పంపిస్తున్నారని డీలరు డి.ఎస్‌వో వివరించారు. అంతేగాక అక్కడే ఉన్న తహసీల్దార్‌కు సైతం తెలిపారు. నెలలో తమకు కనీసం 50 కిలోల నుండి క్వింటాల్ వరకు తమకు తరుగు వస్తుందని తాము ఎలా భర్తీ చేయాలని డీలర్లు వాపోతున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రహమాన్ మాలిక్

భార్య గాయపరచిందని కాలువలో దూకి ఆత్మహత్య

లక్ష్మణచాంద, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాచాపూర్ గ్రామ సమీపంలోని సరస్వతీ కెనాల్‌లో మృతదేహం లభ్యమవటంతో భార్య తన బంధువులతో కలిసి దాడి చేసి గాయపరచిందనే అవమానంతో భర్త కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై రహమాన్‌మాలిక్ వివరాల ప్రకారం... నిర్మల్ మండలం మూరాపూర్ గ్రామానికి చెందిన పులి పెద్దన్న(32)కు ఐదు సంవత్సరాల క్రితం నిర్మల్ మండలం శాంతి నగర్‌కు చెందిన లక్ష్మీతో వివాహం జరిగింది. గత కొన్ని రోజుల నుంచి భార్యాభర్తల మధ్య తరచుగా గొడవలు జరుగగా భార్య లక్ష్మీ ఆమె తల్లి గారి ఇంటికి వెళ్లిపోయింది. ఈ నెల 21న పెద్దన్న తన భార్యని తోలుకొని వస్తానని శాంతినగర్‌కి వెళ్లాడు. అక్కడ మళ్లీ గొడవ జరిగి భార్య లక్ష్మీ, ఆమె బంధువు కలిసి ఎందుకు వచ్చావని ఇష్టం వచ్చినట్టు చేతులతో, కర్రతో తలపై కొట్టగా తల పైన తీవ్రగాయాలు అయ్యాయి. ఎక్కడికైనా వెళ్లి చనిపోలేదా మేమే చంపేస్తామని అతడిని చావుకి ప్రేరేపించారు. వారి వేధింపులు భరించలేక తీవ్ర మనస్థాపానికి గురై సరస్వతి కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నామని మృతుడి తండ్రి పులి రాములు ఇచ్చిన దరఖాస్తు మేరకు మృతుడి భార్యపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం మాస్క్ ధరించి ఆందోళన

● 15 రోజులకు చేరిన

బాసర ఆర్జీయూకేటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరసన దీక్ష



సీఎం రేవంత్‌రెడ్డి మాస్క్ ధరించి ఆందోళన చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

బాసర, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరవధిక నిరసన దీక్ష బుధవారంతో 15 రోజులకు చేరుకుంది.తమ న్యాయమైన డిమాండ్ల సాధనలో భాగంగా అసిస్టెంట్ ప్రొఫెసర్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫోటో మాస్క్ ధరించి వినూత్నంగా నిరసన చేపట్టారు. రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ,సీఎం రేవంత్‌రెడ్డి పట్ల గౌరవంతో తమ సమస్యలను పరిష్కరిస్తారన్న నమ్మకంతో శాంతియుతంగా నిరసన దీక్షను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణప్రసాద్, అజయ్, రాకేష్‌రెడ్డి, శ్రీకాంత్, కుమార్ రాగుల, ఖలీల్, వహీద్, రవికుమార్‌గౌడ్ ,సృజన, శ్వేత, దేవరాజు తదితరులు పాల్గొన్నారు. పహల్గం ప్రాంతంలో జరిగిన తీవ్రవాద దాడిని అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఖండించారు. మృతుల కుటుంబ సభ్యులకు ఆ దేవుడు ధైర్యం ఇవ్వలని కోరుకుంటూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

అంబేద్కర్ ఆశయాల మేరకు మహిళా రిజర్వేషన్లు

● ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా మహిళా రిజర్వేషన్లు, ఆర్టికల్ 370 రద్దు, దళిత, గిరిజన బిడ్డలకు రాష్ట్రపతి పదవులు దక్కేలా చేసిందని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. పట్టణంలో అంబేద్కర్ జయంతి వేడుకల సందర్భంగా బుధవారం జిల్లా అధ్యక్షులు రితేష్‌రాథోడ్ ఆధ్వర్యంలో సెమినార్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంబేద్కర్‌ను అడుగడుగునా అవమానించిన కాంగ్రెస్ పార్టీ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పండుగలా నిర్వహించాలంటూ ఆదేశించడం హాస్యాస్పదం అని, భారతరత్న ఇవ్వకుండా, ఎన్నికల్లో ఓడించి, అడుగడుగునా అవమానించి, చివరకు పార్థివ దేహాన్ని ఢిల్లీలో ఖననం చెయ్యనివ్వని చరిత్ర కాంగ్రెస్ పార్టీది అని తెలిపారు. అంబేద్కర్‌ను కాంగ్రెస్ అవమానిస్తే, బీజేపీ ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బి. లక్ష్మీనర్సయ్య, రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిసెమ్మె రాజు, జిల్లా ఎస్సీ మోర్చ అధ్యక్షులు రాచకొండ సాగర్, జిల్లా నాయకురాలు అలివేలు మంగ, జిల్లా కన్వీనర్ రమేష్, అసెంబ్లీ కన్వీనర్లు, మండల అధ్యక్షులు, బీజేపీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఏకలవ్య విగ్రహ ఆవిష్కరణ

లోకేశ్వరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఏకలవ్య విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ బుధవారం పాల్గొని మాట్లాడారు. లోకేశ్వరం మండల కేంద్రంలో ఏకలవ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చాలా ఆనందదాయకమన్నారు. ప్రతి ఒక్కరూ ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎరుకల (కుర్రు) సంఘం రాష్ట్ర అధ్యక్షులు కే. రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కే. కుమార్, లోకేశ్వరం మండల అధ్యక్షులు కే. నరేష్, లోకేశ్వరం మండల మాజీ సర్పంచ్ సౌజన్య కపిల్, ఎం. శ్రీధర్, లోకేశ్వరం ఎంపీటీసీ జయసాగర్ రావు, లోకేశ్వరం బీజేపీ మండల అధ్యక్షులు సాయన్న, వీడీసీ అధ్యక్షులు బోజన్న, క్యాషియర్ సురేష్, ఏ. శ్రీనివాస్, విఠల్, లోకేశ్వరం ఎరుకల సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



ఏకలవ్య విగ్రహ ఆవిష్కరిస్తున్న దృశ్యం

దళారుల వలలో పడొద్దు

కుంటాల, ఏప్రిల్, 23 : (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ధాన్యం దళారులకు విక్రయించి మోసపోవద్దని ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్ అన్నారు. బుధవారం కుంటాల మండలంలోని అంబుగాం, అందకూర్ గ్రామాలలో వరి, జొన్నల కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో సహకార సంఘం ద్వారా కొనుగోలు చేపడుతున్న జొన్నలకు క్వింటాలుకు రూ 3371 ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తుందని, ఎఫ్‌సీఐ ద్వారా వరి దొడ్డు రకానికి రూ. 2320 మద్దతు ధర చెల్లిస్తుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యం విక్రయించి లబ్దిపొందాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, మాజీ ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్, రమణ రావు, మాజీ సర్పంచ్ సాగర్ రావు, మాజీ ఎంపీటీసీ సుధాకర్, డైరెక్టర్లు సురేష్, వెంకట్ రావు, స్థానిక నాయకులు వెంగల్‌రావు, దాసరికిషన్, పోతన్న, శేఖర్‌రావు, పృథ్వీదర్ రావుతో పాటు రైతులు తదితరులు ఉన్నారు.

'పహాల్గాంకు ప్రతీకారం తీర్చుకోవాలి'



భైంసాలో కొవ్వొత్తులతో మానవహారంగా ప్రదర్శనలిస్తున్న హిందూవాహిని, బీజేపీ శ్రేణులు



భైంసాలో ఆందోళనలు నిర్వహిస్తున్న హిందూవాహిని, బీజేపీ ప్రతినిధులు

భైంసా, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): హిందువులే లక్ష్యంగా నరమేధం చోటు చేసుకున్న పహాల్గాం ఘటనకు ప్రతీకారం తీర్చుకోవాలని హిందూ యువ వాహిని ప్రాంత ప్రముఖ్ చింతపండు మహేష్ అన్నారు. బుధవారం రాత్రి భైంసాలోని శివాజీ చౌక్‌లో హిందూవాహిని, బీజేపీ ఆధ్వర్యంలో పహాల్గాం ఘటనను నిరసిస్తూ చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పాకిస్థాన్ ప్రోత్సాహక ఉగ్రవాదులు మట్టికరువక తప్పదన్నారు. విపత్కర పరిస్థితుల్లో సరిహద్దులోని భద్రతా బలగాలకు వెన్నుదన్నుగా నిలుద్దామన్నారు. నరుల రూపంలోనున్న ఉగ్రవాదులను దేశ సరిహద్దులోనే గుర్తించి తుపాకి తూటాలతోనే సమాధానం చెప్పాలని పేర్కొన్నారు. పాకిస్తాన్ ప్రేరిత ఉగ్రవాద చర్యలను కూకటివెళ్లతో సహ ఏరిపారేయాలన్నారు.

ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్ సర్కార్ చేతిలో ఉగ్రమూకలతో పాటు ప్రేరిత పాకిస్థాన్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.హిందువులంతా సంఘటితమై జాతీపై జరుగుతున్న దుస్సంఘటనలకు తగు రీతిలో గుణపాఠం నేర్పాలని అకాంక్షించారు. ఈ సందర్భంగా శివాజీ చౌక్‌లో ఉగ్రవాదుల చిత్రపటాలను దహనం చేశారు. కోవ్వొత్తులతో మానవహారంగా ఏర్పడి ప్రదర్శనలు చేపట్టారు. పహాల్గాం ఘటనలోని అమరులైన మృతులకు నివాళులర్పించి రెండు నిముషాలు మౌనం పాటించారు. తీవ్రంగా గాయపడ్డ బాధితులు త్వరితగతిన కోలుకోవాలని పూజలు నిర్వహించారు.

డబుల్ బెడ్ రూమ్ కాలనీ వాసుల

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ఖానాపూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులోని డబుల్ బెడ్ రూమ్ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించినట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. కాలనీలో నూతనంగా వేసిన రెండు బోర్లను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా గతంలో కాలనీ వాసులు పడుతున్న తాగునీటి కష్టాలను స్వయంగా పరిశీలించిన తాను ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా ఆలోచన చేసినట్లు పేర్కొన్నారు. కాగా తమ కాలనీలో నీటి సమస్య తీర్చిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌ను కాలనీ వాసులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భూమన్న, వైస్ చైర్మన్ మజీద్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు దయానంద్, పట్టణ అధ్యక్షులు రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్లు సత్యం, రాజేందర్, మాజీ వైస్ చైర్మన్ సంతోష్, జిల్లా నాయకులు సత్యం, సత్యనారాయణ, యూసఫ్ ఖాన్, జహీర్, తదితరులున్నారు.

పహల్గాంలో ఉగ్రవాదం దాడి పిరికిపంద చర్య


● బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్

ఖానాపూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై మంగళవారం జరిగిన ఉగ్రదాడి పిరికిపంద చర్య అని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ అన్నారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా అమాయకులైనటువంటి ప్రజలపై తుపాకి తూటాలతో దాడి చేయడం నీతిమాలిన చర్య అని మండిపడ్డారు. మానవతా విలువలను మరిచి ఇటువంటి దాడులకు తెగబడుతున్న ఉగ్ర మూకలను తుదముట్టించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉగ్ర దాడిలో మరణించిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని దాడిలో గాయపడిన క్షతగాత్రులకు తక్షణమే ఉన్నత స్థాయి వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

చదువుతోనే ప్రగతి : నిర్మల్ ఎస్పీ

భైంసా, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే ప్రగతి సాధ్యమవుతుందన్న విషయాన్ని ప్రతి విద్యార్థి గుర్తు పెట్టుకోవాలని జిల్లా ఎస్పీ డా. జానకీ షర్మిల, భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్‌లు పేర్కొన్నారు. బుధవారం భైంసాలోని క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డా. జానకీ షర్మిల, సబ్ డివిజన్ పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ అవినాష్ కుమార్‌లు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యను అభ్యసించి ఇంటర్ పరీక్ష ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు అభినందించి సన్మానించిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మాట్లాడారు. నేటి పోటీతత్వ యుగంలో దీటుగా రాణించేందుకు గాను సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ జీవిత లక్ష్యాలను చేరుకోవాలని అకాంక్షించారు.

పర్మినెంట్ కాలేదని మనస్థాపంతో ఉరి వేసుకొన్న అటెండర్



నర్సాపూర్(జి), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన తోకల భోజన్న(55) సోమవారం రాత్రి ఉరి వేసుకొని మరణించినట్లు తోకల వంశీ రాజు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు అందించాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి ఇంటివెనుక పడుకుంటానని వెళ్లాడు. అనంతరం కూతురు శివరాణి వెనుకవైపు వెళ్లగా తండ్రి రేకుల షెడ్డులో దూలానికి ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించాడు. 35 సంవత్సరాలుగా పాఠశాలలో అటెండర్‌గా పనులు నిర్వహించేవాడని పర్మినెంట్ కాలేదని తాగుడికి బానిసై జీవితంపై విరక్తి చెంది తాగిన మైకంలో ఉరి వేసుకొని చనిపోయినట్లు కొడుకు వంశీరాజు మంగళవారం ఉదయం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టు మార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి శవాన్ని తరలించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కుంటాల, ఏప్రిల్, 23 : (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కుంటాల పోలీసు సిబ్బంది సూచించారు. బుధవారం కుంటాల మహిళా పోలీసుల ఆధ్వర్యంలో అందకూర్ గ్రామంలో ప్రజలకు సైబర్ నేరాల పట్ల మోసానికి గురికాకుండా ఉండేందుకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

బాధ్యతల ముందు ఈ ఎండెంత!



పొలం పనులకు వెళ్తున్న కూలీలు

సామాన్యులకు ఇంటి బాధ్యతల ముందు ఎంతటి కష్టమైనా తేలిగ్గానే కనిపిస్తుంది. కుటుంబాన్ని పోషించే బాధ్యతలు తీసుకున్న వారికి ఎండ,చలి,వాన లెక్క ఉండదు. వారి దృష్టంతా ఇల్లు గడవడం, మెరుగైన జీవనం గడపడం పైనే ఉంటుందనడానికి ఈ చిత్రాలే నిదర్శనంగా నిలుస్తాయి. దాదాపు 43 డిగ్రీల ఎండలో ఇంటి నుంచి బయటకు అడుగు పెట్టేందుకే జంకుతున్న ప్రస్తుత పరిస్థితిలో వాతావరణ పరిస్థితులను లెక్క చేయకుండా కార్మికులు, రిక్షా వాలాలు, వీధి వ్యాపారులు తమ పనుల్లో నిమగ్నమయ్యారు.తమ కుటుంబాన్ని భాగా చూసుకోవాలన్న వారి తాపత్రయం ముందు భగభగ మండుతున్న సూరీడు కూడా చిన్నబోతున్నాడు.

● (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)



ఎండలో రిక్షా తొక్కుతున్న కార్మికుడు



ఎర్రని ఎండలో కాగితాలు ఏరుకుంటున్న కార్మికులు

ఫొటో న్యూస్





ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దృశ్యం



ట్రాక్టర్‌పై కూలీ పనులకు వెళ్తున్న కూలీలు



ఎండ తీవ్రతకు గొడుగు నీడలో పండ్లు విక్రయిస్తున్న వ్యాపారులు

ఫటా..ఫట్...

ఉపాధి కూలీలకు పని కల్పిస్తున్నాం

● చాదల జగన్నాథ్, ఇన్‌చార్జి ఏపీఎం ఎన్‌ఆర్‌ఈజీఏ, నర్సాపూర్(జి)



ఆంధ్రజ్యోతి : యంత్రాలతో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయని సోషల్ మీడియాలో వార్తలు నిజమేనా...?

ఏపీఎం : అర్లీ(కే) గ్రామంలో ఎర్రకుంట చెరువులో ఫిష్ పాండ్ పనులు జరుగుతు న్నాయి. ఆదివారం గ్రామానికి చెందిన కొందరు గ్రామ దేవతల ఆలయాల వద్ద మొరం అవసరం కావడంతో జేసీబీతో మొరం తవ్వారు. ప్రజా ఫిర్యాదుల విభాగం నుండి ఫిర్యాదు అందింది. విచారణ చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి : ఉపాధి హామీ పనులు మండలంలో ఏఏ గ్రామాల్లో జరుగుతున్నాయి?

ఏపీఎం: తొమ్మిది లక్షల అంచనా వ్యయంతో అర్లీ(కే), గొల్లమాడ, తురాటి, తిమ్మాపూర్, టెంబరేణి గ్రామాల్లోని చెరువులలో ఫిష్ పాండ్ పనులు జరుగుతున్నాయి. చాక్‌పల్లి, బూరుగుపల్లి గ్రామాల్లో ఎటువంటి పనులు జరగడం లేదు. నర్సాపూర్, రాంపూర్, కుస్లి, నందన్, భామ్ని గ్రామాల్లో ట్రెంచ్ పనులు, అంజనీ తండాలో మళ్లింపు కాలువలు పనులు జరుగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి : జాబ్ కార్డులు కొత్తగా పనులు చేసే వారికి ఏ విధంగా అందిస్తున్నారు...?

ఏపీఎం: ప్రస్తుత సమయంలో నూతనంగా జాబ్ కార్డులను అందించడం లేదు.

ఆంధ్రజ్యోతి : పనులు జరిగే చోట పనులకు సంబంధించి ఏవైనా బోర్డులు అమర్చుతున్నారా లేదా...?

ఏపీఎం: ఉపాధి హామీ పనులు పూర్తి అయిన తర్వాత కూలీల సంఖ్య పని దినాలు, అంచనా వ్యయం, రైతు వివరాలు వంటి సమాచారంతో కూడిన బోర్డులను బిగిస్తామన్నారు.

● (నర్సాపూర్(జి), ఆంధ్రజ్యోతి)

ఘనంగా పాదపూజ కార్యక్రమం



తల్లితండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

భైంసా, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుజిరిగల్లి శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో బుధవారం అమ్మ,నాన్నకు వందనం, పాదపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులు తమ తమ తల్లితండ్రులతో పాటు చదువు నేర్పిన గురువుల పాదాలను నీటితో కడిగి పూజ కార్యక్రమాలను చేపట్టారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీ సరస్వతీ శిశు మందిర్ జిల్లా ప్రబంధకారిణి ప్రతినిధులు పి.గోపాల్ కిషన్, శ్రీధర్, పెండెప్ కాశీనాథ్,శివకుమార్ బచ్చువార్, తోట రాము, పెరుగు నవీన్, సుదర్శన్ తదితరులు మాట్లాడుతూ విద్యార్థులు సనాతనమైన అచార, వ్యవహారాలకు అనుగుణంగా నడుచుకుంటూ సంస్కృతి, సంప్రదాయలను పాటించాలని పిలుపునిచ్చారు. సన్మార్గంలో పయనిస్తూ ఉన్నత చదువులు చదివి భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని అకాంక్షించారు.

పక్షుల దాహం తీరుస్తున్న స్నేహితులు



ఉట్నూర్‌లో చెట్టుకు కుండీలు కట్టి పక్షులకు నీళ్లు పెడుతున్న దృశ్యం

ఉట్నూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండుతున్న ఎండలకు పక్షులకు నీళ్ల అందు బాటులో ఉంచాలని భావించిన స్నేహితులు పాత రంజన్లను కుండీలుగా మార్చి చెట్లకు కట్టి పక్షుల దాహం తీరుస్తున్నారు. ఉట్నూర్ పట్టణానికి చెందిన కారు డ్రైవర్ అమర్ అఫారి, కూలర్ మెకానిక్ షేక్ అఫ్సర్‌లు వేసవి తాపానికి నీటి కోసం విలవిలలాడుతున్న పక్షుల దాహం తీర్చాలని భావించారు. ఐబీ ప్రాంతంలోని చెట్ల వద్దకు వస్తున్న పక్షుల కోసం స్వయంగా కుండీలలో నీళ్లపోసి పక్షులు తాగేలామానవత్వం చాటుకుంటున్నారు.



కుండీ వద్దకు నీళ్ల కోసం వచ్చిన పక్షులు

రాధాకృష్ణ దేవాలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠాపన

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భాగ్యనగర్‌లో గల రాధాకృష్ణ దేవాలయంలో రాధా మురళీకృష్ణ నూతన విగ్రహాల పునఃప్రతిష్ట కార్యక్రమాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితులు పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో రాధాకృష్ణులను దర్శించుకున్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు హాజర య్యారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, పట్టణ అధ్యక్షులు నాందేడపు చిన్ను, కొట్టే శేఖర్, అడపా శ్రీకాంత్, తన్నీరు చైతన్య, తదితరులు ఉన్నారు.

.. పాల్గొన్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

పట్టణంలోని భాగ్యనగర్‌లో గల రాధాకృష్ణ ఆలయం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి బుధవారం రోజు మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి హాజరయ్యారు. వేద పండితులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ... తాను దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఈ ఆలయ నిర్మాణానికి 50 లక్షల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. అనంత రం ఇంద్రకరణ్ రెడ్డిని శాలువా తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జి. ఈశ్వర్ తాజా మాజీ మున్సిపల్ చైర్మన్, పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి మాజీ జడ్పీటీసీ, రమణారెడ్డి పీఎస్‌సీఎస్ చైర్మన్, పాకా రామచందర్, శ్రీకాంత్ యాదవ్ మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్, వినయ్, రవి, సత్యనారా యణ, టెంపుల్ మెంబర్స్ పలువురు, నాయకులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపనలో మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



నడ్డంగూడ వాగు వద్ద నిర్మించిన చెక్‌డ్యాం



పులిమడుగు వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్

చెక్ డ్యాంలు ఇలా.. నీరు నిలిచేదెలా..!?

● ఉట్నూర్‌లో వృథాగా నిర్మాణాలు

ఉట్నూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలను అభివృద్ధి చేయాలని భావించిన ప్రభుత్వం దశాబ్దాల కాలంగా వాగుల పై చెక్‌ డ్యాములు నిర్మిస్తున్న ప్రభుత్వ నిధులు హారతి కర్పూరంలా కరిగిపోతున్న ప్రయోజనం మాత్రం శూన్యంలా కనిపిస్తున్నాయి. ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతంలోని ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ మండలాల్లోని వాగులపై అక్కడక్కడ ప్రభుత్వం చిన్న తరహా నీటిపారుదల శాఖ, పంచాయతీరాజ్ శాఖల ద్వారా చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. లక్షల రూపాయలు వ్యయం చేస్తూ నిర్మించిన చెక్‌డ్యామ్‌ల ద్వారా భూగర్భ జలాలు అభివృద్ధి చెందుతాయని భావించారు. పనులు చేసిన కాంట్రాక్టర్లకు, పనులు చేయించిన అధికారులకు కాసుల వర్షం కురిపించడంతో చెక్‌ డ్యామ్‌ల పనులు నాణ్యత లోపంగా సాగడంతో కొన్నేళ్లకే చెక్‌డ్యాములకు పక్కన వేసిన మట్టి, రివిట్‌మెంట్లు కొట్టుకు పోయాయి. వాగుల పై నీటికి అడ్డంగా నిర్మించిన చెక్‌డ్యాముల సమీపంలో గోడలకు వేసిన సిమెంటు, బండరాళ్లు, మట్టి వర్షాకాలంలో కురుస్తున్న వర్షాలకు కొట్టుక పోవడంతో చెక్‌డ్యాములు ఉన్నా లేనట్టుగా తయారు అయ్యాయి. నడ్డంగూడ సమీపంలోని వాగు పై మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన చెక్‌డ్యామ్ రెండు దశాబ్దాల కంటే ముందే కొట్టుకు పోయింది. నాటి నుంచి నేటి వరకు ఈ చెక్ డ్యాం మరమ్మత్తులు చేయించడానికి అధికారులు ఎవరు ముందుకు రాకపోగా ప్రజలు సైతం అధికారుల దృష్టికి తీసుకు రావడంలో విఫలమయ్యారు. పులిమడుగు వాగు పై దత్తాత్రేయ ఆలయం సమీపం నుంచి ప్రవహిస్తున్న వాగు పై నిజాం కాలంలో బండ రాళ్ల, గానుగ సిమెంటుతో నిర్మించిన చెక్‌డ్యామ్ చెక్కు చెదరకుండా నేటికి కనిపిస్తుంది. కాని రెండు వైపుల ప్రతి వర్షాకాలంలో కురుస్తున్న భారీ వర్షాలకు మట్టి కొట్టుకు పోయి చెక్‌డ్యామ్ ఉన్న ప్రయోజనం లేకుండా పోయింది. శ్యాంపూర్ నుంచి లక్కేటిపేట వెళ్లే మార్గంలో ఉన్న వంతెన వద్ద దశాబ్దాం క్రితం నిర్మించిన చెక్‌డ్యామ్ వర్షాలకు కొట్టుకు పోయిన పట్టించుకునే నాథులు కరువయ్యారని రైతులు వాపోతున్నారు.

ఆశయం నేరవేరాలి

వాగులపై అడ్డంగా నిర్మించిన చెక్‌డ్యాముల ద్వారా భూగర్భజలాలు అభివృద్ధి చెందాలన్న గొప్ప ఆశయంతో నిర్మించిన చెక్‌డ్యామ్‌ల కలలు తీరడం లేదు. చెక్‌డ్యాంల కింద నీరు నిలువ ఉన్నట్లయితే పశు, పక్షాదులకు దాహం తీర్చడంతో పాటు భూగర్భ జలాలు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉంటాయని భావించి నిర్మించిన ఆశయం నెరవేరేలా అధికారులు ప్రణాళికలు చేసి మరమ్మతులకు చేరువైనా చెక్‌డ్యాంలకు ప్రజాప్రతినిధులు నిధులు మంజూరు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యవసాయ పనులకు 'మహా' కూలీలు

● జొన్న, మక్క కోతలకు పొరుగు రాష్ట్ర వాసులు ● ఉపాధి హామీ పనులతో స్థానికంగా దొరకని కూలీలు



జొన్న కోత పనులు చేస్తున్న మహారాష్ట్ర వాసులు

దిలావర్‌పూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మక్క, జొన్న కోతలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం గ్రామాల్లోకి ఉపాధి హామీ పనులు సాగుతుండటంతో స్థానిక కూలీలు దొరకని పరిస్థితి ఉంది. దీంతో సకాలంలో వ్యవసాయ పనులు చేసేందుకు రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వ్యవసాయ పనులు వెనకపడుతున్నాయి. ఖరీఫ్ సాగుకు ఇంకో నెలన్నర సమయయే ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో మహారాష్ట్ర నుంచి వచ్చిన కూలీలు వస్తుండటంతో రైతులకు ఊరట లభిస్తోంది.

గ్రూపులుగా వచ్చిన మహారాష్ట్ర కూలీలు..

ఉమ్మడి దిలావర్‌పూర్ మండలం వ్యవసాయ ఆధారిత మండలం కాగా ఈ మండలంలో చేతినిండా వ్యవసాయ పనులు దొరుకుతాయి. చేసే వారికి చేసినంత పని దొరుకుతుండటంతో మహారాష్ట్ర నుంచి కూలీలు గ్రూపులు గ్రూపులుగా వస్తున్నారు. ఉమ్మడి మండలంలోని ప్రతీ గ్రామం లో మహారాష్ట్ర కూలీలు వ్యవసాయ పనులు చేస్తూ ఉపాధి పొందు తున్నారు. ప్రతీ గ్రామంలో 5 నుంచి 10 గ్రూపులున్నాయి. ఒక్కో గ్రూపులో ఆరుగురు నుంచి పది మంది ఉంటారు. దిలావర్‌పూర్, గుండంపల్లి లాంటి గ్రామాల్లోనైతే 20 నుంచి 40 గ్రూపుల వరకు మహారాష్ట్ర కూలీలు పని చేస్తున్నారు.

ఎకరానికి రూ. 6,500 వరకు..

ప్రస్తుతం మక్క, జొన్న, నువ్వు కోత పనులు సాగుతున్నాయి. మహారాష్ట్ర కూలీలు ఎకరాన జొన్న కోసి కుప్పగా వేయడానికి రూ.6,000 నుంచి రూ. 6,500, మొక్కజొన్నకు రూ. 4,200 నుంచి రూ. 4,500 వరకు తీసుకుంటున్నారు. నువ్వుకు రూ.5,000ల నుంచి 5,500లు తీసుకుంటున్నారు. రైతులు వారు చెప్పిన కూలీలను చెల్లిస్తూ పనులు పూర్తి చేసుకుంటున్నారు. స్థానిక కూలీలతో పోలిస్తే మహారాష్ట్ర వాసులు తీసుకుంటున్నది తక్కువేనని, పనులు సకాలంలో పూర్తవుతున్నాయని అంటున్నారు.

కుటుంబంతో కలిసి వస్తాం..

● అంకుష్, ఇస్లాపూర్, మహారాష్ట్ర



మాది మహారాష్ట్రలోని ఇస్లాంపూర్. మేము ప్రతీ సంవత్సరం వస్తాము. రైతులు ఫోన్లు చేసి మమ్మల్ని పిలిపించుకుంటారు. ఈ సమయంలో మా దగ్గర పనులు ఉండవు. ఫిబ్రవరిలో కుటుంబంతో వస్తాం. నాలుగు నెలలు ఉండి వెళ్లిపోతాం.

ఐదేళ్ల నుంచి వస్తున్నాం..

● రాములు, ఇస్లాపూర్, మహారాష్ట్ర



ఐదేళ్ల నుంచి పనులకు వస్తున్నాం. నాలుగు నెలలు ఉంటాం. ఒక్కొక్కరం నెలకు కనీసం 12 వేల నుంచి 15 వేలు సంపాదిస్తాం. మా అక్కడ ఇప్పుడు పనులు ఉండవు. ఇక్కడ వ్యవసాయ పనులు అన్ని చేస్తాం. గుత్త గా చేస్తాం. లేకుంటే కూలీకైనా వెళ్తాం. ఇప్పుడైతే కొందరు ఇక్కడే జీతానికి ఉంటున్నారు.

మన దగ్గర కూలీలు దొరకడం లేదు..

● అల్లారి రవీందర్ రెడ్డి, రైతు, టెంబుర్ని



మన దగ్గర కూలీల కొరత తీవ్రంగా ఉంది. అందులోనూ ఉపాధి హామీ పనులు జరుగుతు న్నాయి. ఖరీఫ్ దగ్గర కొస్తున్నది. అందుకే మక్క, జొన్న, నువ్వు కోతలను మహారాష్ట్ర కూలీలకు ఎకరం ఇసాబ్‌తో గుత్తగా ఇస్తున్నాం. మహారాష్ట్ర కూలీలు ఉండబట్టే వ్యవసాయ పనులు సకాలంలో చేయగలుగుతున్నాం.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 45.0 : కనిష్ఠం 27.9
నిర్మల్ జిల్లా వార్తలు
8
గురువారం 24 ఏప్రిల్ 2025



వడదెబ్బతో ఒకరి మృతి

ముథోల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆష్ట గ్రామానికి చెందిన బెస్త గంగారాం(55) అనే వ్యక్తి వడదెబ్బతో బుధవారం మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మృతుడు వృత్తిరీత్యా చేపలు పట్టేవాడు. అయితే గత రెండు రోజుల క్రితం ఇంటి నుంచి కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటకు వెళ్లాడు. ముథోల్‌లోని మహాలక్ష్మి గల్లీలో తిరుగుతూ ఉన్నాడు. రెండు రోజుల నుంచి ఎండతీవ్రత ఎక్కువ ఉండటంతో అస్వస్థతకు గురై మహాలక్ష్మి గల్లీలోని ఓ బ్యాంక్ సమీపాన పడుకొని ఉన్నచోటే మృతి చెందాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వచ్చి మృతదేహాన్ని తమ స్వగ్రామమైన ఆష్టకు తీసుకెళ్లారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

నిప్పుల కొలిమి





సిబ్బందికి సూచిస్తున్న డీఎంహెచ్‌వో రాజేందర్



ఎండ నుంచి తట్టుకునేందుకు గొడుగు ఏర్పాటు చేసుకుని పండ్లను విక్రయిస్తున్న వ్యాపారి

- జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఉక్కపోతకు ఇంట్లో ఉండలేం.. ఎండ ధాటికి బయటికి వెళ్లలేం..
- ఇప్పుడే 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతల నమోదు
- మే నెలలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజల ఆందోళన
- ఎండ వేడిమి తట్టుకోలేక వడదెబ్బకు గురవుతున్న జనం
- జాగ్రత్తలు పాటించాలంటున్న అధికారులు

ఖానాపూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గత వారం రోజులుగా ఎండతీవ్రత పెరిగిపోయింది. నిప్పుల కొలిమిలా మారిపోయింది. మంగళవారం గరిష్ఠంగా 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో జిల్లాలో ఉదయం ఏడింటికే భానుడు భగభగ మండుతూ నిప్పులు కురిపించేలా కనిపిస్తున్నాడు. దీంతో ఓవైపు తీవ్రమైన ఎండ మరోవైపు ఉదయం నుంచి రాత్రి వరకు తీవ్రమైన ఉక్కపోత జనాల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ నేపథ్యంలో అత్యవసర పరిస్థితులుంటే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. దీంతో జిల్లాలోని ప్రధాన పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో సైతం మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. గత వారం రోజులుగా క్రమేపి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్న సమయంలో కర్ఫ్యూ వాతావరణం కనిపిస్తోందని ప్రజలు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా గత రెండు మూడు రోజులుగా అన్ని మండలాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో జిల్లాలో అధికారులు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేశారు. ఇప్పటికే 44.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైన నేపథ్యంలో మరో 0.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైతే నిర్మల్ జిల్లాలో రెడ్ అలర్ట్ జారీ అవుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని ప్రజలను హెచ్చరిస్తున్నారు.

ఉక్కపోతకు ఇంట్లో ఉండలేం.. ఎండధాటికి బయటికి వెళ్లలేం

ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఓవైపు భారీగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో గాలిలో తేమ శాతం తగ్గిపోయి తీవ్రమైన ఉక్కపోత వాతావరణం నెలకొంటోంది. మరోపక్క సూర్యుడు తన ప్రతాపం చూపుతుండడంతో ఎండదంచి కొడుతోంది. ఇటు ఉక్కపోత భరిస్తూ ఇంట్లో ఉండలేక అటు బయటకు వెళ్లి సూర్యప్రతాపాన్ని భరించలేక జనం సతమతమవుతున్నారు. వృద్ధులు, పిల్లలు ఈ ఎండలు, ఉక్కపోతతో తల్లడిల్లిపోతున్నారు. పెళ్లిళ్లు, శుభకార్యాలకు వెళ్లేందుకు కూడా జనాలు జంకుతున్నారు. దాహం తీర్చుకునేందుకు చల్లని శీతల పానీయాల వైపు మొగ్గుచూపుతున్నారు. కొంత మంది వడదెబ్బకు గురై ఆసుపత్రుల పాలవుతున్న సంఘటనలు కూడా వెలుగులోకి వస్తున్నాయి.

భారీగా ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనానికి ఎన్నో యత్నాలు

జిల్లాలో ప్రస్తుతం నమోదవుతున్న భారీ ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నుంచి ఉపశమనం పొందేందుకు జిల్లా వాసులు ఎన్నో యత్నాలను చేస్తున్నారు. ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయించడంతో పాటు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు కూలర్లు, ఏసీలను విపరీతంగా వాడుతున్నారు. వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలను పాటిస్తున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అత్యవసరమైతే తప్ప ఇంట్లోంచి బయటకు రావడం లేదు. కొబ్బరి నీళ్లు, తాటి ముంజలు, ఖర్బూజపండ్లు, పండ్ల రసాలు, నిమ్మరసంతో పాటు ఎండను తట్టుకునేందుకు మజ్జిగ లాంటి వాటిని తాగుతూ ఉపశమనం పొందుతున్నారు.

ఏప్రిల్‌లోనే ఇలా ఉంటే.. మే లో ఎలా ?

ప్రస్తుతం ఏప్రిల్ నెలలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండలు సుమారు 45 డిగ్రీలను అందు కునేలా ఉండడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. రానున్న మే మాసంలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. రోహిణి కార్తెకు నెల రోజుల ముందే సూర్యుడు తన ప్రతాపం చూపిస్తుండగా రోహిణి కార్తెలో పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళన ప్రజల నుంచి వ్యక్తమవుతున్నది. సాధారణంగా రోహిణి కార్తె (మే 25 నుండి జూన్ 8 వరకు)లో ఎండలు జోరు గా ఉంటాయి. కానీ రోహిణి కార్తె ఆరంభానికి ఇంకా నెల రోజుల సమయం ఉండగానే ఎండలు రోహిణిని తలపిస్తున్నాయి. దీంతో ప్రజలు ఈ ఎండల తీవ్రతను చూసి రాబోయే రోహిణి ఎలా ఉంటుందోనని చర్చించు కోవడం కనిపిస్తోంది.

వడదెబ్బ బారిన పడకుండా ముందు జాగ్రత్తలే మేలు

వేసవిలో వడదెబ్బ నుంచి రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. తలనొప్పి, కండరాలు పట్టేయడం, వికారం, కళ్లు తిరగడం, వాంతులు చేసుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. ప్రతీరోజు 5 నుంచి 6 లీటర్ల నీటిని తాగాలని, శీతల పానీయాలకు బదులు మజ్జిగ, నిమ్మ, పండ్ల రసాలు తాగడం ఉత్తమమని, పండ్లు కూడా తీసుకోవాలని సూచిస్తున్నారు. బైక్ మీద వెళ్లేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు ఎండలో ప్రయాణం చేయకూడదని, తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సివస్తే గొడుగు పట్టుకొని వెళ్లాలని సూచిస్తున్నారు. వడదెబ్బ తగిలితే ఓఆర్ఎస్ పొడిని కలిపి తాగించాలని, అది దొరకని పరిస్థితుల్లో నీటిలో కొంచెం ఉప్పు లేదా పంచదార కలుపుకొని తాగాలని, అపస్మారక స్థితిలోకి వెళ్తే నీరు తాగించకుండా వీలైనంత త్వరగా దవాఖానకు తరలించాలని వైద్యులు చెబుతున్నారు.



ఉదయం 11 దాటితే బయటకు రాకపోవడం మంచిది

● డాక్టర్ రాజేందర్
(జిల్లా వైద్యాధికారి, నిర్మల్)

ప్రస్తుతం నిర్మల్ జిల్లాలో ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఉదయం 11 దాటితే ఇళ్ల నుంచి బయటకు రాకపోవడం మంచిది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా వడదెబ్బ బారిన పడి పరిస్థితి విషమించిన వారు ఎవరూ లేకపోవడం శుభ పరిణామం. ఈ వేసవిని తట్టుకొని వడ దెబ్బ బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి. నల్లని దుస్తులు ధరించకూడదు. ప్రతి ఒక్కరూ 5 నుంచి 6 లీటర్ల వరకు నీటిని తాగాలి. ఉపాధి హామీ పనుల నిర్వహణ వద్ద, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఆశావర్కర్ల ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ నిర్వహిస్తున్నాం. వడదెబ్బ బారిన పడిన రోగిని వెంటనే ఆసుపత్రికి తరలించాలి.

జిల్లాలో 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత

● 5 మండలాలలో రెడ్ అలర్ట్ జారీ

ఖానాపూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. బుధవారం జిల్లాలోని నాలుగు మండలాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కుభీర్, దస్తురాబాద్, పెంబి, నర్సాపూర్(జి), కడెం మండలాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఈ ఐదు మండలాల్లో రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో అత్యధికంగా కుభీర్ మండలంలో 45.2 డిగ్రీ ఉష్ణోగ్రతలు నమోదు కాగా సోన్ మండలంలో అత్యల్పంగా 41.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. దీంతో ఐదు మండలాల్లో రెడ్ అలర్ట్, మిగతా మండలాల్లో ఆరెంజ్ అలర్ట్‌ను అధికారులు జారీ చేశారు. భారీగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

దిమ్మదుర్తి మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన డీసీసీ అధ్యక్షుడు



మాజీ సర్పంచ్‌ను పరామర్శిస్తున్న డీసీసీ అధ్యక్షుడు

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : దిమ్మదుర్తి మాజీ సర్పంచ్‌ను బుధవారం పరామర్శించినట్లు డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు తెలిపారు. పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మామడ మండలంలోని దిమ్మదుర్తి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నీరటి గంగన్న సతీమణి నీరటి అనసూయ తునికాకు సేకరణకు వెళ్లి ప్రమాదవశాత్తు గాయపడ్డ విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు ఆసుపత్రికి వెళ్లి అనసూయను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆరోగ్యం పట్ల ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. వారితో పాటు కొట్టే శేఖర్, తదితరులు ఉన్నారు.

బాధితురాలిని పరామర్శించిన మాజీ మంత్రి అల్లోల



బాధితురాలిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి అల్లోల

సారంగాపూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కౌట్ల(బి) గ్రామానికి చెందిన అట్లా నర్సవ్వ అనారోగ్యంతో బాధపడుతున్న బాధితురాలిని బుధవారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించి అనారోగ్యానికి సంబంధించిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వర్ణఫంక్షన్‌హాల్‌లో జరిగిన వివాహ వేడుకలకు హాజరయ్యారు. ఈయన వెంట సొసైటీ చైర్మన్ బాన్సపెల్లి రమణరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు బొల్లోజీ , మాజీ ఎంపీపీ అట్లా మైపాల్‌రెడ్డి, నర్సయ్య, మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దశరథ్, రాజేశ్వర్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

ఇంటర్ ఫలితాలలో ఎస్ఆర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. సీనియర్ ఎంపీసీ విభాగంలో శ్రీనిధి 991, సృజన 986, బైపీసీ విభాగంలో శ్రీహర్ష 992, వైష్ణవి 991, మొదటి సంవత్సరం ఎంపీసీలో లక్ష్మీ ప్రసన్న 467, స్వాతి 466, ఉమ్మే హైమాన్ 466, బైపీసీ విభాగంలో శ్రీహర్ష 438, అఖిల 436, శివాని 434 మార్కులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను డీజీఎం గోవర్ధన్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి నగేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

● కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

తానూర్ , ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే భూభారతి ప్రవేశపెట్టినట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించి కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. రెవెన్యూ ఉద్యోగులు, భూ చట్టాల నిపుణులు, రిటైర్డ్ ఉద్యోగులు, న్యాయ నిపుణులను ఎన్నోసార్లు సంప్రదించిన తర్వాతే భూభారతి చట్టానికి సమగ్రరూపాన్ని తీసుకువచ్చారన్నారు. భూభారతి పై రైతులకు అవగాహన కల్పించారు. భూములపై ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్నా దరఖాస్తులు చేసుకొని భూభారతి చట్టం ప్రకారం సమస్యలు తీర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ లింగమూర్తి, ఇన్‌చార్జీ ఎంపీడీవో నసీరొద్దీన్, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావుపటేల్, పీఏసీఎస్ చైర్మన్ నారాయణ్‌రావుపటేల్, రైతులు ఉన్నారు.

వానల్‌పాడ్ గ్రామంలో..

భైంసా రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో బుధవారం రైతు వేదిక కార్యాలయంలో భూ భారతి అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడారు. భూ భారతి చట్టంపై ప్రజలకు అవగాహన పరిచారు. రైతులు తమ భూ సమస్యలన్నింటినీ పరిష్కారం కోసం కలెక్టర్, తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల చుట్టూ తిరగడం తప్పుతుందన్నారు. అధికారులే తమ గ్రామ పంచాయతీకి వచ్చి తమ భూ సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తారన్నారు. గతంలో భూ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో రైతులు చాలా ఇబ్బంది ఎదుర్కోవాల్సి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకురావడంతో రైతుల భూ సమస్యలు త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని తెలిపారు. మే మొదటి వారంలో నుంచి గ్రామాల్లో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ప్రతి రైతు సమస్యలను వెనువెంటనే పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. సదస్సుకు వచ్చిన రైతులు గ్రామాల్లో ప్రతి ఒక్కరికి భూ భారతి చట్టంపై అవగాహన కల్పించాలని కోరారు. ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోగా తన డైరీలో రాసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో కోమల్ రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో సుధాకర్, ఏఎంసీ చైర్మన్ ఆనందరావు పటేల్, వివిధ శాఖల అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



వానల్‌పాడ్ గ్రామంలో భూభారతి అవగాహన సదస్సుకు హాజరైన రైతులు

ఎల్‌ఆర్‌ఎస్ రుసుము చెల్లించిన ఐదుగురికి సన్మానం

● అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



నిర్మల్ రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఎక్కువ మొత్తంలో ఎల్‌ఆర్‌ఎస్ రుసుము చెల్లించిన ఐదుగురికి కలెక్టరేట్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లా మొత్తం ఇప్పటి వరకు 6,277 మంది ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు క్రమబద్ధీకరణకు రుసుము చెల్లించా రని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 44 వేల 602 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు వచ్చాయని, ఇందులో ఆమోదం పొందిన దరఖాస్తుదారులు 6,277 మంది రిజిస్ట్రేషన్ రుసుమును చెల్లించి తమ దరఖాస్తులను క్రమబద్ధీకరించుకున్నారని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ మొత్తంలో రుసుములు చెల్లించిన వారిలో ఐదుగురిని ఎంపిక చేసి సంబంధిత అధికారులతో కలిసి గురువారం మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో సన్మానం కార్యక్రమం నిర్ణయించామని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

భూ భారతి చట్టంతో రైతులకు ఎంతో మేలు : ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

కడెం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం కడెం మండలంలోని ధర్మాజీపేట్ గ్రామంలో కడెం మండల తహసీల్దార్ ప్రభాకర్ ఆధ్వర్యంలో గ్రామ రైతులకు, ప్రజలకు భూ భారతి చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ... గతంలో అధికారంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి ఏర్పాటు రైతులకు, ప్రజలకు భూ సమస్యలపై తీరని అన్యాయం చేసిందన్నారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణిని తీసి వేస్తామని హామీ ఇచ్చిన మేరకు ప్రస్తుత ప్రభుత్వం ధరణిని తొలగించి నూతనంగా భూ భారతి చట్టం అమలులోకి తేవడం జరిగిందన్నారు. భూ భారతి చట్టం ద్వారా రైతులకు, ప్రజలకు భూ సమస్యలు పరిష్కారం కావడానికి అవకాశం కలిగిందన్నారు. భూ భారతి చట్టాన్ని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం ధర్మాజీపేట్ గ్రామంలో పాండ్వాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఏఎంసీ చైర్మన్ పడిగెల భూమన్న, భూషణ్, పాండ్వాపూర్ పీఏసీఎస్ చైర్మన్ రామడుగు శైలజ రమేష్ రావు, ఖానాపూర్ ఏఎంసీ డైరెక్టర్ డి. యాదగిరి, కడెం మండల ఎస్సై నాగవర్ధన్, కడెం ఎంపీడీవో అరుణ, రెవెన్యూ ఉద్యోగులు జాడి శ్రీను, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పి. సతీష్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు టి. శంకర్, మండల నాయకులు ఆకుల లచ్చన్న కోల శ్రీనివాస్, మొహమ్మద్ సలీం, బొడ్డు గంగన్న, టి. సత్తన్న, రమేష్, శేఖర్‌లతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



భూ భారతి చట్టం అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

చెట్టును ఢీకొట్టిన కారు



ప్రమాదానికి గురైన కారు

కడెం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దోస్త్ నగర్ గ్రామ సమీపంలో కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లోగో వద్ద ప్రధాన రహదారిపై కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో శివకృష్ణ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వీరిని జన్నారం ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. హాజీపూర్ నుంచి కడెం మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్ గురుకుల పాఠశాలకు తండ్రి శివకృష్ణ కొడుకు శ్రీకాంత్ వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

అతిగా మద్యం తాగి యువకుడి మృతి

నర్సాపూర్(జి), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుస్లీ గ్రామంలో డుకారే రాహుల్(38) దందేగాం జిల్లా హింగోలి మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన వ్యక్తి గత కొన్ని సంవత్సరాలుగా బతుకుదెరువు కోసం కుస్లీ గ్రామానికి కూలీ పనుల నిమిత్తం వచ్చి నివసిస్తున్నాడు. ఇతను తాగుడుకు అలవాటు పడ్డాడు. రోజులాగే ఈ నెల 22న మద్యం సేవించాడు. రాత్రి 8 గంటల సమయంలో తన భార్య ద్రుపదను మద్యం తాగడానికి డబ్బులు అడుగగా తాను డబ్బులు ఇచ్చేసరికి డబ్బులు తీసుకొని బయటకు వెళ్లి వస్తానని చెప్పి రాత్రి ఇంటికి రాలేదు. ఫోన్ చేసిన లిఫ్ట్ చేయలేదు. బుధవారం ఉదయం 7 గంటల సమ యంలో అటువైపు పెంట కుప్పలు పోయడానికి వెళ్లి కుస్లీ గ్రామానికి చెందిన వ్యక్తి చూసి అతడిని గుర్తు పట్టగా కుస్లీ గ్రామానికి దగ్గర గల చిన్న మురికి కాలువలో పడి మరణించాడని తన భార్య ద్రుపదకు తెలుపగా, తన భర్త మరణం గురించి నర్సాపూర్(జి) పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చింది. ఎస్సై సాయికిరణ్ కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

సోన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాక్‌పట్ల గ్రామానికి చెందిన బోడ గంగయ్య అనే రైతుకు చెందిన గేదె కరెంటు షాక్‌తో మరణించింది. బుధవారం ఉదయం మేతకు వెళ్లిన గేదె బోరు బావి వైర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో అక్కడికక్కడే మరణించిందని పాడి రైతు తెలిపాడు. గేదె విలువ రూ. 60,000 వేలు ఉంటుందని, ప్రభుత్వం తరపున ఆదుకోవాలని రైతు గంగయ్య విజ్ఞప్తి చేశారు.

బీసీ కులాల ఐక్య వేదిక జిల్లా కార్యవర్గం ఎన్నిక

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీసీ భవన్‌లో బీసీ కులాల ఐక్య వేదిక జిల్లా కార్యవర్గం ఎన్నిక బుధవారం నిర్వహించినట్లు ఎంసీ లింగన్న తెలిపారు. జిల్లా కమిటీ అధ్యక్షులు ఎంసీ లింగన్న, ప్రధాన కార్యదర్శిగా నర్సాగౌడ్, సభ అధ్యక్షులుగా భాస్కర్, కార్యనిర్వాహణ అధ్యక్షులుగా మనోజ్ యాదవ్, కోశాధికారిగా గంగాధర్, అదనపు కార్యదర్శిగా సాయన్న, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, తదితరులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

నేడు ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తల సమావేశం

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఆమ్ ఆద్మీ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ తెలిపారు.